క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



కోడూరు: మండలంలో ఇటీవల ఇరువురు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. పిట్టల్లంక పంచాయతీ స్వీపర్‌గా పని చేస్తున్న తెనాలి రంగారావు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన విశ్వనాథుని గోపాల్‌కృష్ణ గుండెపోటుతో మరణించాడు. ఇరువురి కుటుంబ సభ్యులను రమేష్‌బాబు పరామర్శించి, సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వరరావు, ఇంకొల్లు శేషగిరిరావు, బావిశెట్టి పూలేంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా బజార్ పరిశీలన

పెడన: మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా విభాగం ఆధ్వర్యంలో మెప్మా స్వయం సహాయ సంఘాలతో ఏర్పాటు చేసిన అర్బన్ మహిళా మార్కెట్ (మెప్మా బజార్)ను సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న చేతి ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకాలు, మార్కెటింగ్ ప్రోత్సాహకాలు, ఆన్లైన్ నెట్వర్క్ డిజిటల్ కామర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, టీఎంసీ భోగేశ్వరరావు, సీఓ వెంకటేశ్వరరావు, నాగమ్మ, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మోపిదేవి: మోపిదేవి కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ (25 సంవత్సరాలు) సందర్భంగా శుక్రువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన మెడ్‌స్టార్ హాస్పటల్స్ సహకారంతో చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగచంద్ర, డాక్టర్ రవికుమార్ 2డీ ఎకో గుండె స్కానింగ్, ఈసీజీ పరీక్ష, బీపీ, షుగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ సీహెచ్ హరీష్‌బాబు మాట్లాడుతూ బ్యాంక్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. బ్యాంక్ అభివృద్ధికి సహకరిస్తున్న కస్టమర్లకు, బ్యాంక్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ మండల సాయి, పలువురు ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకలోడు బండ్లకు జరిమానా

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెం కృష్ణానది నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుకలోడు బండ్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ శ్రీవిద్య ఒక్కొక్క బండికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు.

రెవెన్యూ సదస్సు..

మండలంలోని మేళ్లమర్తిలంక గ్రామ పంచాయతీ వద్ద శుక్రువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామానికి సంబంధించి పలు సమస్యలపై రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. డీటీ వాణి, వీఆర్ఓ ప్రశాంత్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నాగాయలంక: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో నాగాయలంక గ్రామంలో శనివారం ఉదయం కరెంటు నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ జి.వెంకటరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కింద లైన్స్‌పై విద్యుత్ తీగలకు ఆటంకం కలిగిస్తున్న చెట్లు కొమ్మలు నరకడం, పోల్స్ లీనింగ్స్, మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

- **మచిలీపట్నంటౌన్:** నగరంలోని ఉల్లింగిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మల్కాపట్నంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎ.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మల్కాపట్నం, జగన్నాథపురం, రైలుపేట, బుట్టాయిపేట, అరవగూడెం, రాబర్ట్‌సన్‌పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హుండీ కానుకల ఆదాయం రూ.5.40 లక్షలు

పెడన: పట్టణంలోని శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు పూర్తికావడంతో దేవదాయశాఖాధికారులు శుక్రవారం ఆలయంలోని హుండీ కానుకలను లెక్కించారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకటమోహనరావు, ఉత్సవ కమిటీతో పాటు ఆసాది తోట రామారావుల పర్యవేక్షణలో దేవదాయశాఖ సిబ్బంది హుండీలోని నగదును లెక్కించారు. రూ.5, 40,598 వచ్చాయని ఆలయ ఈవో తెలిపారు. అజ్ఞాత భక్తుడొకరు హుండీలో రూ.41, 100లను వేసినట్లు దేవదాయశాఖ సిబ్బంది గుర్తించారు. 2025 జనవరి ఐదో తేదీన పైడమ్మ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఉంటుందని, భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించాలని ఈవో ఈ సందర్భంగా కోరారు.

విద్యుత్ పోటుపై తిరుగుబాటు







మచిలీపట్నంలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు : అవనిగడ్డలో ఏడీఈకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు, నేతలు : పెడన విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఉప్పాల రాము తదితరులు

- బాబు.. చెప్పేదొకటి చేసేదొకటి
- విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ప్రచారంలో హామీ
- గెలిచిన ఆర్నెల్లకే చార్జీలు పెంచి మోసం
- వైఎస్సార్ సీపీ పోరుబాట
- పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్
- మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట నిరసనలు

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్‌చార్జీల బాదుడును నిరశిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం పోరుబాట పట్టాయి. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ర్యాలీలు నిర్వహించి విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా..

నియోజకవర్గ కేంద్రమైన మచిలీపట్నం పంపుల చెరువు వద్ద ఉన్న విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు భారంగా మారిన పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పలు డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ధర్నా అనంతరం ఎస్ఈకి వినతి పత్రం అందించేందుకు వెళ్లగా ఆయన లేకపోవటంతో ఆయన కుర్చీకి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ ముఖ్యమంత్రి కుర్చీ కోసం చంద్రబాబునాయుడు ఏ అబద్ధాలైన ఆడతాడనే దానికి విద్యుత్ చార్జీల పెంపే ఓ నిదర్శనమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలపై ఎలాంటి భారాలు మోపకుండా సంక్షేమ పాలన అందించారన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్నినాని, నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టుల పిలుపులో భాగంగా మరిన్ని ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నగర మేయర్ చిటికిన వెంటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు, నగర డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, అర్బన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, కాగిత జవహర్‌లాల్, యండ్రపాటి నాగేశ్వరరావు, కట్టా కేథారేశ్వరరావు, జోగి చిరంజీవి, గాజుల శ్రీదేవి, పల్లి శేఖర్, గోపిశెట్టి సతీష్, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జిలు, పలు గ్రామాల ఇన్‌చార్జిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ

అవనిగడ్డ: విద్యుత్తు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పోటెత్తారు.



ఎస్ఈ కుర్చీకి వినతి పత్రం అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, నేతలు సలార్‌దాదా, ఎల్వీఆర్, మోకా

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్తు శాఖ కార్యాలయం వరకూ రెండు కిలో మీటర్ల మేర ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం ఏడీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావుకు సింహాద్రి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చార్జీలు పెంచి ప్రజల పై పెనుభారం మోపిందన్నారు. పెంచిన చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు చింతలపూడి లక్ష్మీ నారాయణ, యాదవరెడ్డి సత్యనారాయణ, ఎంపీపీలు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం బసవయ్య, పార్టీ నేతలు నలకుర్తి పృధ్వీరాజ్, గాజుల జయ గోపాల్, గార్లపాటి గోపి, వల్లూరి ఉమాతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన బాబు..

పెడన: విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన చంద్రబాబు గెలిచిన ఆర్నెల్లలోనే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్ (రాము) విమర్శించారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం విద్యుత్ చార్జీలకు పెంపునకు నిరసనగా పార్టీ శ్రేణులు పెడనలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తోటమూలలోని విద్యుత్ ఏఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సబ్ స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏఈ ఏడుకొండలుకు వినతిపత్రం అందజేశారు. పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెడన నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నింటి మహేష్, కొండవీటి నాగబాబు, సుజ్ఞానం మహేష్, వైధాని వెంకట్రాజు, బండారు మల్లికార్జునరావు, పర్లంపెదబాబు, సంగా మధుసూదనరావు, మైలా రత్నకుమారి, గరికపాటి వెంకటరామానాయుడు, రాజులపాటి అచ్చుతరావు, కొల్లాటి గంగాధరరావు, కటకం ప్రసాద్, శిరివెళ్ల జయేష్, కారుమంచి కామేశ్వరరావు, తిరుమాని శ్రీనివాసరావు, గొరిపర్తి రవికుమార్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అదనపు చార్జీల పేరుతో దగా..



అధికారంలోకి ఎప్పుడు వచ్చినా చంద్రబాబునాయుడు ప్రజలపై అదనపు భారం మోపుతూ రాష్ట్ర ప్రజలను దగా చేస్తూనే ఉన్నారు. ఎన్నికల సమయంలో కరెంటు చార్జీలను తగ్గిస్తామని చెప్పి ఆరు నెలలకే రూ.15 వేలకోట్లకు పైగా ప్రజలపై భారం వేశారు. సూపర్ సిక్స్ హామీలను వెనక్కు నెట్టి ప్రజల నెత్తిన శఠగోపం పెట్టాడానికి ఎన్డీయే కూటమి సిద్ధమైంది.

– బుంగా నాగవెంకట శ్రీనుబాబు (నాని), చెన్నూరు, పెడన మండలం

చాలా ఇబ్బంది పడుతున్నాం..



ప్రస్తుతం విద్యుత్ చార్జీల పెంపుతో ఇబ్బంది పడుతున్నాం. మా పిండిమిల్లుకు ప్రతి నెలా రూ.6 వేల మేర విద్యుత్ బిల్లు వచ్చేది. చార్జీలు పెరిగిన తర్వాత రూ.9,500 వస్తోంది. బిల్లు కట్టేందుకు ఇబ్బంది పడుతున్నాను. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు ప్రస్తుతం హామీలను విస్మరించి భారాలు మోపటం ఎంత వరకు సమంజసం.

– పీ అంజనేయులు, పిండిమర మిల్లు నిర్వాహకుడు, మచిలీపట్నం టౌన్

రెండున్నర ఎకరాల వరికుప్ప దహనం

కోడూరు: రెండున్నర ఎకరాల వరికుప్ప దహనం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నక్కవానిదారికి చెందిన అప్పికట్ల వెంకటేశ్వరరావు (బుజ్జి) ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఐదు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాడు.15 రోజుల క్రితం రెండున్న ఎకరాల్లో పంట యంత్రాలతో కోసి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకున్నాడు. మిలిగిన పోలంలోకి యంత్రం వెళ్లే అవకాశం లేకపోవడంతో వారం రోజుల క్రితం కోత కోసి కుప్ప వేశాడు. శుక్రవారం గుర్తు తెలియని వారు వరి కుప్పకు నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న వెంకటేశ్వరరావు వెళ్లి చూడగా వరికుప్ప పూర్తిగా ఆహుతైంది. సుమారు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. పోలీసులు ఘట నాస్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. సీఐ యువకుమార్, ఎస్ఐ చాణిక్య అనుమానితులను గుర్తించే పనిలో ఉన్నారు.

ఆరేళ్ల నుంచి ఇదే విష సంస్కృతి..

నక్కవానిదారిలో ఆరేళ్ల నుంచి బాధితుడి కుటుంబ సభ్యుల వరికుప్పలను తగలపెడుతున్నారు. ఆరేళ్లలో 12 వరికుప్పలను తగలపెట్టగా, రైతుకు సుమారు రూ.10 లక్షలు ఆస్తినష్టం. ఏటా కుప్పలను తగలపెట్టడంతో ఈ ఏడాది ముందు జాగ్రత్తగా యంత్రాల సహాయంతో పంటను కోయించి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకున్నానని, యంత్రం వెళ్లని ప్రాంతంలో వరికుప్ప వేస్తే ఇలా జరిగింది.

పూరిల్లు దగ్ధం

కోడూరు: పూరిల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం జరిగింది. నక్కవానిదారికి చెందిన అప్పికట్ల సుబ్బారావు కుటుంబం పూరింటిలో ఉంటోంది. శుక్రవారంసాయంత్రం సుబ్బారావుఇంట్లో నుంచి మంటలు వ్యాపించగా స్థానికులు ఆర్పేప్రయత్నం చేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో వారంతా పొలం పనులకు వెళ్లిఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇంట్లో రెండు గ్యాస్ బండలు పెలడంతో భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెప్పారు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బందివివరాలు సేకరించారు.

కేవీకే సందర్శన

ఘంటసాల: పరిశోధన, విస్తరణ విభాగాలు కలిసి పని చేస్తూ వ్యవసాయం పురోభివృద్ధికి కృషి చేయాలని గుంటూరు లాం వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణితో కలసి శాస్త్రవేత్తల కార్యచరణ అంశాలను పరిశీలించి భవిష్యత్తు కార్యచరణ అంశాలు, కేవీకే అభివృద్ధి కోసం సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కేవీకేలోని కోళ్ల పెంపకం, డైరీ యూనిట్, మేకలు పెంపకం, వానపాముల ఎరువు తయారీ కేంద్రం, అజోల్లా, ఉద్యాన నారు పెంపకం, వరి విత్తన ఉత్పత్తి కేంద్రం, ఇతర ప్రదర్శనలను పరీక్షించి శాస్త్రవేత్తలకు సూచనలు, సలహాలు అందించారు. ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియ లలిత, కేవీకే శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య

పెడన: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మహిళల రక్షణకు ప్రత్యేకంగా జాతీయ స్థాయిలోనే మహిళా కమిషన్ ఉందని, దీని ద్వారా గ్రామస్థాయిలో కూడా న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, మచిలీపట్నం జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ కేవీ రామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోమహిళలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జీ మాట్లాడుతూ న్యాయస్థానం అందరికీ అందుబాటులో ఉండే వ్యవస్థ అని పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ మహిళా కమిషన్ 2024 అక్టోబరు నుంచి 2025 మార్చి వరకు సర్వే చేస్తోందన్నారు. ఇందు కోసం జాతీయ న్యాయసేవాధికారి సంస్థ నుంచి సహాయ సహకారాలను కోరిందని, ఇందులో భాగంగానే మహిళల చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆ చట్టాలు వల్ల మహిళలు ఎలాంటి సమస్యల నుంచి బయటపడొచ్చు, న్యాయసేవలు పొందడానికి ఉన్న అవకాశాల వివరాలు తెలియజేయడం కోసం సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టాల గురించి తెలుసుకుని సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరామ్, సీడీపీవో సముద్రవేణి, న్యాయవాదులు గోవర్ధనమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

- **డీఎంహెచ్‌వోను కలిసిన గ్రామీణ వైద్యులు**



చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామీణ వైద్యులు తమ పరిధిని మించి వైద్యం చేయకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శర్మిష్ట అన్నారు. ఆమె కార్యాలయంలో శుక్రవారం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎం అండ్‌హెచ్‌వో మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి వెంకటరాజు, నెల్లి రాంబాబు, జిల్లా సలహా మండలి చైర్మన్ బడే భవన్నారాయణ, డి రామకృష్ణరాజు, డి రజనీకాంత్, ఎండీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

- **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

గూడూరు:పైడమ్మ జాతరను పురస్కరించుకుని పోసినవారిపాలెంలో జరిగిన ఘర్షణలో గాయపడిన నాయుడు శ్రీనివాసరావు (30) విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 22న పెడన పైడమ్మ సంబరంలో పిండివారిపాలెంకు చెందిన నాయుడు శ్రీనివాసరావుకు పేరే సత్యనారాయణ మధ్య వివాదం తలెత్తింది. స్నేహితులు సర్ది చెప్పడంతో అక్కడితో ఆగిపోయింది. వివాదాన్ని మనస్సులో పెట్టుకున్న సత్యనారాయణ మద్యం సేవించి పోసినవారిపాలెం పంచాయతీ దగ్గర మాటు వేసి శ్రీనివాసరావును ఎత్తి నేలకేసికొట్టాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో శ్రీనివాసరావు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. విజయవాడ తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. పెడన సీఐ కె.నాగేంద్ర ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


- **క్రీడాదుస్తులు బహూకరణ**

నాగాయలంక: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన 30 మంది బాలబాలికలకు పాఠశాలకు చెందిన టీచర్ తుంగల కళ్యాణి రూ.10 వేలు విలువైన క్రీడాదుస్తులను రెండు సాఫ్ట్‌బాల్‌లను బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం పీవీఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా వీటిని శుక్రవారం అందజేశారు. పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **జాబ్ మేళాలో 13 మందికి ఉద్యోగాలు**

అవనిగడ్డ: అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 13 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ– సీడాప్, అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవనిగడ్డలో జాబ్ మేళా నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపా డాక్టర్ డి.ఉమారాణి సంయుక్తంగా తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధుల 27 మందిని ఇంటర్వ్యూలు చేయగా 13 మంది ఎంపికైనట్లు వైస్ ప్రిన్సిపాల్ అంకారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్కిల్ హబ్ ఇన్‌చార్జి ముత్యాల వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ సిబ్బంది జి.పృథ్వీజ, ఆర్.ప్రశాంత్ కుమార్, కళాశాల అద్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

- **మాజీ పీఎం మన్మోహన్‌సింగ్‌కు నివాళి**



మచిలీపట్నంటౌన్: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పట్టాభి భవనంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మచిలీపట్నం పార్టీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతిన్, నాయకులు మట్టా దత్తుడు, నల్లబోలు శామ్యూల్, పేరిశెట్టి నాగరాజు, దత్తుడు, సయ్యద్ నూరుద్దీన్, సయ్యద్ రహమతున్నీసా, మహమ్మద్ అయూబ్, మహమ్మద్ అబ్దుల్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

- **అవనిగడ్డ:** అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి సందర్భంగా సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, దివిసీమ లలిత కళాసమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

- **కిశోర వికాసంపై శిక్షణ**

ఘంటసాల: సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మండల స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, జీఎంఎస్కేలు,

సంక్షిప్తంగా...

వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సుబ్బారావు, మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్, ఎంఈవో– 2 ఎండీ మోమిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.రమానాగమణి, డి.మేరీ, ఐసీపీఎస్ లీగల్ అడ్వైజర్లు శైలజ, కిషోర్ పాల్గొన్నారు.

- **బేతేలు మందిర వ్యవస్థాపక దినోత్సవం**

మచిలీపట్నంటౌన్: నగరంలోని రైలుపేటలో ఉన్న బేతేలు ప్రార్థనా మందిరం వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, యువతీ, యువకులు పలు క్రైస్తవ గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రార్థనా మందిరం పాస్టర్ రెవరెండ్ నేరెళ్ల వాల్టర్స్ వాక్యోపదేశం చేశారు. సంఘస్తులు, వివిధ పార్టీల నాయకులతో కలసి ఆయన కేక్ కట్ చేశారు. 2025 నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర బీసీ సంఘ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జనసేన నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము, వైఎస్సార్ సీపీ నగర నాయకులు బూరగ రామారావు, బందెల థామస్‌నోబుల్, పాస్టర్ హెబేలు ప్రసంగించారు. నృత్యపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

- **జిల్లా స్థాయిలో సత్తాచాటిన విద్యార్థులు**

అవనిగడ్డ: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ నిర్వహించిన కృష్ణాజిల్లా స్థాయి వకృత్వ, వ్యాస రచన పోటీల్లో అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ ఎన్‌వీ నరసింహారావు శుక్రవారం తెలిపారు. కళాశాలకు చెందిన బండి నాగ సౌమ్య వ్యాస రచనలో ప్రథమ స్థానం, చందు సాయి కృష్ణ వకృత్వ పోటీల్లో ద్వితీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. వీరికి మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.5 వేల నగదు, ప్రశంసా పత్రాలను అందుకున్నారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావుతో పాటు అధ్యాపకులు ఎ.శ్రీనివాసరావు, దుడ్డు కృష్ణారావు, సింగం దిలీప్, పూషడపు సుబ్బారావు, జె.సాయి కుమార్, ఐ.హరిజ, సిబ్బంది అభినందించారు.

- **ఫిబ్రవరిలో ఘంటసాలలో కిసాన్ మేళా**

ఘంటసాల: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగే కిసాన్ మేళాను విజయవంతం చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. ఘంటసాల గ్రామంలోని వ్యవసాయ పరిశోధన స్థానాన్ని శుక్రవారం సందర్శించి వరి మాగాణి అపరాల పరిశోధన క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఘంటసాలలో ఫిబ్రవరిలో నిర్వహించబోయే విజయవంతం చేయడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియలలిత, కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ లహరి, రేవతి, వెంకటలక్ష్మి, యశ్వంత్, పాలిటెక్నిక్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- **విద్యార్థినికి రూ.2.30 లక్షలు సాయం**



పెడన: పట్టణంలోని 13వ వార్డు మఠంవీధికి చెందిన భట్ట జ్ఞానపూజ విద్యార్థిని పాలిటెక్నిక్ చదువుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స తీసుకుని ఇంటి వద్ద ఉంటోంది. విద్యార్థినికి ఆపరేషన్ నిమిత్తం దేవాంగ యూత్ ఆధ్వర్యంలో చందాలు వసూళ్లు చేసి శుక్రవారం దేవాంగ పెద్దల చేతులు మీదుగా విద్యార్థినికి, కుటుంబ సభ్యులకు రూ.2,30,016 అందజేశారు. కష్టం వచ్చిన ఆడపిల్లకు దేవాంగ బాంధవులు అండగా నిలిచిన తీరు అభినందనీయమంటూ పలువురు వక్తలు కొనియాడారు. విద్యార్థిని పాలిటెక్నిక్ చదువుతూ మచిలీపట్నం వెళ్లి వస్తుండగా డీమార్ట్ సమీపంలో ఆటో ఢీకొనడంతో కాలు పూర్తిగా చిద్రం అయింది. వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఆమె కాలుకి రెండు మేజర్ ఆపరేషన్లు చేయాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్ చేయించడం తల్లికి భారం కావడం తో దేవాంగ యూత్ సేవా సమితిని ఆశ్రయించారు. రాష్ట్ర నలుమూలల నుంచి అందిన సాయాన్ని ఇచ్చామని సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన మున్సిపల్ మాజీ చైర్మన్ బందారు ఆనంద్ ప్రసాద్, శ్రీ గంగా పార్వతి సామెత అగస్త్యేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, కొసనం నాగభూషణం, బొమ్మిడి ప్రసాద్, పేరిశెట్టి నాగ రవి, దేవాంగ యూత్ సేవా సమితి సభ్యులు ఊటుకూరి సుధీర్ కుమార్, పుచ్చల వీర కోట సుబ్రమణ్యం, పింజల రవీంద్ర, కారుపర్తి రాము, కటకం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- **ముగిసిన రెవెన్యూ సదస్సులు**



పెడన: మండల వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. పెడన పట్టణానికి సంబంధించి చివరి రోజు శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నాలుగు ఆర్జీలు రాగా మరికొన్ని ఆర్జీలపై తీవ్ర చర్చ జరిగినట్లు ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 2, 3వ వార్డులకు సంబంధించి దేవదాయశాఖకు చెందిన భూముల సర్వే నంబర్ల విషయంలో క్లారిఫికేషన్‌పై ఆ శాఖ ఈవో టీవీవీ మోహనరావు, టీడీలు నరసింహారావు, సల్మాల, పట్టణానికి చెందిన పలువురు ఈ భూములపై చర్చించిన అనంతరం సమస్య దేవదాయశాఖ కమిషనర్ వద్దకు తీసుకువెళ్లాలని నిర్ణయించుకుని వెళ్లారన్నారు. ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల ద్వారా పెడన పట్టణం కాకుండా 265 ఆర్జీలు వచ్చాయి. వీటిల్లో 140 ఆర్జీలను పరిష్కరించామని, మిగిలిన 125 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించి ఆర్జీదారులకు సమాచారం ఇస్తాం. మండల సర్వేయర్ దాసు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆక్వా రొయ్య రైతు సోదరులకు విజ్ఞప్తి

ఆక్వా రొయ్య రైతు సోదరులకు నమస్కారములు. మా సుహాన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (NGR సుబ్బారాయుడు గ్రూప్) హేచరీస్ పాండురంగపురం బాపట్ల నందు వనామి Sy Aqua సీడ్ అమ్మకానికి సిద్ధంగా ఉంది. కావున రైతులందరూ అడ్వాన్స్ బుకింగ్ కొరకు సంప్రదించగలరు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

9849795559, 8985346999